www.kalamjyothi.com


# కలంజ్యోతి

రేపటి కోసం

బుధవారం

02 ఏప్రిల్ 2025

విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రిజకీయాలు, సామాజిక అంశిలపై అవగాహన ఉండి.. రియగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003



# హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తం



- హెచ్ సీయూకు వెళ్లేందుకు రాజకీయ పార్టీల నేతల యత్నం అడ్డుకున్న పోలీసులు, పలువురి అరెస్ట్
- గచ్చిబౌలి భూములపై హైకోర్టులో పిటిషన్
- పిల్ దాఖలు చేసిన వాటా ఫౌండేషన్
- అత్యవసర పిటిషన్ స్వీకరించాలని కోరిన లాయర్
- నేడు విచారించనున్న తెలంగాణ హైకోర్టు

2లో



# ప్రతిపక్షాలది పొలిటికల్ డ్రామా

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- కంచ గచ్చిబౌలి భూములపై వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- ఆ భూమిని డెవలప్ చేసి వివిధ రూపాల్లో ప్రజల కోసమే వినియోగిస్తామని వెల్లడి
- మంత్రులతో సీఎం ప్రత్యేక సమావేశం


2లో



# రేషన్ బియ్యం ఇచ్చేది మోదీనే!

- యేడాదికి కేంద్రం వాటా రూ.10 వేల కోట్లు
- సన్నబియ్యం పథకంతో రాష్ట్ర వాటాగా రూ.2800 కోట్లు
- లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న 'ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన' రసీదు
- సోషల్ మీడియాలో వైరల్

3లో


25040111330541585
F.P. 1911005
Ravinder Kadergula
365320158363
PHH/FSC
Apr2025
01-04-2025 11:33:05
Fortified Sannabiyyam(18kg) 18 18 0.0 0.00
TOTAL PRICE: Rs 0.00

# ప్రతిపక్షాలది పొలిటికల్ డ్రామా



**కలంజ్యోతి, హైదరాబాద్** : కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ప్రతిపక్షాలు చేస్తున్న పొలిటికల్ డ్రామాలను తిప్పికొట్టాలని మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వాస్తవాలను జనాల్లోకి తీసుకెళ్లాలని, ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో నుంచి వెనక్కి తీసుకున్న ప్రభుత్వ భూమిని డెవలప్ చేసి వివిధ రూపాల్లో ప్రజల కోసమే వినియోగించబోతున్నామనే విషయాన్ని తెలియజేయాలని అన్నారు. మంగళవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, శ్రీధర్ బాబు, సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కంచ గచ్చిబౌలి 400 ఎకరాల భూములపై జరుగుతున్న రగడతోపాటు రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌పై చర్చించారు. విద్యార్థులను కొన్ని రాజకీయ పార్టీలు రెచ్చగొట్టి.. ప్రభుత్వానికి చెందిన భూమిని హెచ్ సీయూకు సంబంధించినదిగా అబద్ధపు ప్రచారం చేస్తున్నాయని ఇంటెలిజెన్స్ ఇచ్చిన నివేదికపై సమీక్షించారు. ఈ వ్యవహారంలో ముందు నుంచి ఏం జరిగిందనే దానిపై పూర్తి వివరాలను మీడియా ద్వారా రాష్ట్ర ప్రజలకు వెల్లడించాలని మంత్రులను సీఎం ఆదేశించారు. విద్యార్థులను రెచ్చగొట్టి ఆందోళన చేయిస్తున్న పొలిటికల్ పార్టీల వ్యవహారాన్ని బయటపెట్టాలని, ధర్నాల వెనక ఉన్న చీకటి శక్తుల భరతం పట్టాలని పోలీసు ఉన్నతాధికారులను సీఎం ఆదేశించినట్టు తెలిసింది.




# అక్రమ అరెస్టులను ఖండించండి

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్** : హెచ్ సీయూ భూములను ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు విక్రయించడానికి సిద్ధపడడాన్ని సీపీఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ప్రభుత్వం తక్షణమే ఆ భూముల నుంచి వెనక్కి రావాలని శనివారం సీపీఎం చలో హెచ్ సీయూకు పిలుపునివ్వడం జరిగింది. దీన్ని అడ్డుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేయడానికి సీపీఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. ప్రజా పాలనలో అక్రమ అరెస్టులను ఆపాలని డిమాండ్ చేసింది. ఈ అరెస్టుల్లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గం పర్వతాలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు పొదిలి రామయ్య, గుంపల్లి అశోక్ పాల్గొన్నారు.





# హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తం

**కలంజ్యోతి, హైదరాబాద్ :**

కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కంచ గచ్చిబౌలి భూములను పరిరక్షించాలంటూ పెద్ద ఎత్తున విద్యార్థులు ఆందోళనకు దిగారు. హెచ్‌సీయూ మెయిన్ గేట్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. యూనివర్సిటీ లోపలికి వెళ్లేందుకు బీజేవైఎం, ఏబీవీపీ, వామపక్షాల నేతలు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. దాంతో రేవంత్ సర్కారుపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**విద్యార్థుల నిరసన.. ప్రముఖుల మద్దతు..**

విద్యార్థుల నిరసనల జోరుతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) అట్టుడుకుతున్నది. పదుల సంఖ్యలో జేసీబీలు, వందలాది మంది పోలీసుల బందోబస్తుతో హెచ్‌సీయూ పరిధిలోని 400 ఎకరాల భూమి నిండిపోయింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి యూనివర్సిటీలోని పచ్చని చెట్లను బుల్డోజర్లు కూకటివేళ్లతో పెకిలించి వేస్తున్నాయి. విలువైన ఔషధ మొక్కలు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. అరుదైన పక్షులు, జంతువులు బిక్కుబిక్కుమంటూ పరుగులు పెడుతూ హాహాకారాలు చేస్తున్నాయి. తెలంగాణలో ఏం జరుగుతుందో తెలుసుకోండి రాహుల్‌గాంధీ' అంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఎక్స్‌లో వీడియో పోస్టు చేశారు. 'తెలంగాణ ప్రభుత్వం డజన్ల కొద్దీ బుల్డోజర్లతో హెచ్‌సీయూ భూముల్లో విధ్వంసం సృష్టిస్తున్నది. వెంటనే వాటిని ఆపాలి. ఈ పోరాటంలో తన మద్దతు హెచ్‌సీయూ విద్యార్థులకే' అని ప్రముఖ పర్యావరణ ఉద్యమకారిణి లిసిప్రియా కంగుజమ్ పోస్టు చేశారు. 'హెచ్‌సీయూ భూముల అమ్మకానికి వ్యతిరేకంగా విద్యార్థులు నిరసన తెలిపితే వాళ్లను అరెస్టుచేయడం ఘోరం' అని టాలీవుడ్ నటుడు ప్రియదర్శి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఖండించారు. 'పారిశ్రామిక ప్రాజెక్ట్ కోసం జీవవైవిధ్యం గల భూమిని కాపాడాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరితే, కోర్టు విచారణ పూర్తికాకముందే జేసీబీలతో విధ్వంసం చేస్తున్నారు ఎందుకు?' అని ప్రముఖ పర్యావరణ పాత్రికేయురాలు బహార్‌దుత్ పోస్టు చేశారు. 'హెచ్‌సీయూలో అభివఅద్ధి చెందుతున్న వఅక్ష, జంతుజాలాన్ని నాశనం చేస్తున్నారు. చూస్తేనే గుండె



తరుక్కుపోతుంది. ఈ మట్టిలో 237 పక్షిజాతులు, మచ్చల జింకలు, పాములు ఉన్నాయి. ఇవన్నీ మన వారసత్వం, సంస్కృతికి చిహ్నాలు' అని గుంజన్ పోస్ట్ చేశారు. 'తెలంగాణ ప్రభుత్వం హెచ్‌సీయూలో చేస్తున్న జీవవైవిధ్య విధ్వంసంపై జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఎందుకు మౌనంగా ఉంది ? సుమోటో కేసుతో చట్టపరమైన చర్యలు తీసుకోండి' అని బీఆర్ఎస్ నేత శుభప్రద్ పటేల్ పోస్టు చేశారు. హెచ్‌సీయూ భూముల్లో రేవంత్ సర్కారు విధ్వంసాన్ని వామపక్ష, విద్యార్థి, యువజన సంఘాల నేతలు ఖండించారు.

**హెచ్ సీయూ వద్దకు చీకోటి ప్రవీణ్..**

విద్యార్థులకు మద్దతుగా బీజేపీ నాయకుడు చీకోటి ప్రవీణ్ ఒక్కడే తన కారులో హెచ్ సీయూ వద్దకు చేరుకున్నారు. పోలీసులు అడ్డుకున్నా వెనక్కి తగ్గకుండా హెచ్ సీయూ గేట్ లోపలికి వెళ్లేందుకు యత్నించారు. అయితే పోలీసులు అతడిని అడ్డుకున్నారు. అటు బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు హెచ్ సీయూ వద్దకు రాగా పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు.

**రాజకీయాలకు అతీతంగా సంఘీభావం..**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ హెచ్ సీయూ వద్ద గత కొద్ది రోజులుగా విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. అయితే ఈ ఆందోళనలు ఇప్పుడు రాజకీయ మలుపు తిరిగాయి. విద్యార్థుల అరెస్ట్ కు వ్యతిరేకంగా ఆయా రాజకీయ పార్టీలు సంఘీభావం ప్రకటించాయి. దీంతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**కేటీఆర్, హరీష్‌రావు ఇండ్ల వద్ద పోలీసులు**

కంచ గచ్చిబౌలి భూములపై వివాదం నేపథ్యంలో బీఆర్ఎస్ నేతల నివాసాల వద్ద పోలీసులు మోహరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు నివాసాల వద్దకు పోలీసులు చేరుకున్నారు. విద్యార్థులకు మద్దతుగా వారు హెచ్‌సీయూకు వెళ్లనున్నారనే సమాచారంతో పోలీసులు వారి ఇంటివద్ద పోలీసులు మోహరించారు.

**హైకోర్టులో పిల్..**

కంచ గచ్చిబౌలి భూములపై హైకోర్టులో పిల్ దాఖలైంది. కంచ గచ్చిబౌలి భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలంటూ వట ఫౌండేషన్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. అత్యవసర విచారణకు స్వీకరించాలని ఫౌండేషన్ తరపు న్యాయవాది కోరారు. దీనిపై బుధవారం విచారణ చేపడతామని హైకోర్టు తెలిపింది.

# రేషన్ బియ్యం ఇచ్చేది మోదీనే!






**కలంజ్యోతి, హైదరాబాద్ :** నిరుపేదలందరూ తెల్ల అన్నం తినాలని, వారందరికీ ఇకపై రేషన్ షాప్ ల నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ జరుగుతుంది. ఇదంతా బాగానే ఉన్నా.. ఈ కోటా మొత్తం తమ ప్రభుత్వమే ఇస్తున్నదని, యేటా రూ.10 వేల కోట్లు ఖర్చుచేస్తున్నట్లు రేవంత్ ప్రకటించారు. కానీ, అది పూర్తిగా తప్పని రేషన్ లబ్ధిదారులకు తాజాగా పంపిణీ చేసిన సన్నబియ్యానికి సంబంధించిన రసీదే తేటతెల్లం చేసింది.

**రసీదు సారాంశం..**

మంగళవారం రేషన్ షాప్ లో ఒకతను 18 కిలోల సన్నబియ్యం తీసుకోగా 'ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన' రసీదు వచ్చింది. అందులో లబ్ధిదారుడి మొత్తం కేటాయింపు 18 కిలోలు. కేంద్రం కేటాయింపు 15 కిలోలు , కేంద్ర ఆర్థిక వ్యయం రూ.37.52, కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ 562.8, రాష్ట్ర కేటాయింపు 3 కిలోలు, రాష్ట్ర ఆర్థిక వ్యయం 42.01, రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ 126.03, ఇతరత్రా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మొత్తం 149.58 సబ్సిడీ రసీదు మీద ప్రింట్ అయి వచ్చింది. ఇది గమనించిన లబ్ధిదారులు రేషన్ బియ్యం ఇచ్చేది మోదీనా? అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో గప్పాలు కొట్టిన రేవంత్ రెడ్డి బండారం మొత్తం బయట పడినట్లైంది. ఇదే రసీదు ఉదయం నుంచి సాయంత్రం వరకు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. సన్నబియ్యంలో మోదీ వాటా ఉన్నదని బీజేపీ నేతలు రసీదును ఆయుధం చేసుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

**కేంద్రానిదే అగ్రభాగం..**

రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డుల ద్వారా పేదలకు బియ్యం పంపిణీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నది. ఈ మొత్తాన్ని కూడా కేంద్రమే భరించుకుంటూ.. కరోనా ఆపద సమయం నుంచి 'ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన' పథకాన్ని రూపొందించి పేదలకు ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నది. కేంద్రం అందించే ఐదు కిలోలు కాకుండా రాష్ట్రం మరో కిలోను కలుపుతూ.. ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున అందిస్తున్నది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న సన్న బియ్యం నిర్ణయంతో ప్రభుత్వం పై రూ.2800 కోట్ల భారం పడనున్నది. ఇంతకు ముందు రాష్ట్రం అందించే కిలో దొడ్డు బియ్యానికి రేవంత్ సర్కార్ యేడాదికి రూ.650 కోట్లను ఖర్చు చేసేది. ఒక్కో కిలో సన్న బియ్యం కొనుగోలు కు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 ని అదనంగా చెల్లిస్తున్నది. తద్వారా కొత్తగా తెలంగాణ ప్రభుత్వానికి రూ.2800 కోట్ల అదనపు భారం పడుతున్నది.

# టోల్ మోత

**కలంజ్యోతి, నిర్మల్ :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాల్లో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ సోమవారం అర్ధరాత్రి నుంచి ఛార్జీలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఈ ఛార్జీలు అమలులోకి వచ్చాయి. దాంతో నిర్మల్ జిల్లాలో ఉన్న గంజాల్, దిలావర్ పూర్ టోల్ ప్లాజాల్లో ఛార్జీలు పెంచారు. గంజాల్ టోల్ ప్లాజాలో కార్లు, జీపులకు గతంలో సింగిల్ ఛార్జి రూ.60 ఉండగా దీన్ని రూ.65కు పెంచారు. ఐతే రిటర్న్ ఛార్జీలు మాత్రం యథాతథంగా ఉన్నాయి. నెలవారీ పాస్ ను రూ.2075 నుంచి రూ.2145 కి పెంచారు. దిలావర్ పూర్ టోల్ ప్లాజాలో సింగిల్ ఛార్జీలు యథాతథంగా ఉంచారు. రిటర్న్ ఛార్జీలు మాత్రం రూ.77 నుంచి రూ.80 కి పెంచారు. నెలవారీ పాస్ ను రూ. 1675 నుంచి రూ.1735 కి పెంచారు. గంజాల్ టోల్ ప్లాజా లో లైట్ వాణిజ్య వాహనాలకు సింగిల్ రూ.100 నుంచి రూ.105 కు, రిటర్న్ రూ.150 నుంచి రూ.155 కు పెంచారు. నెలవారీ పాస్ ను రూ.3350 నుంచి రూ.3470 కి పెంచారు. బస్సులు, ట్రక్కుల కు సింగిల్ ఛార్జీలు రూ.210 నుంచి రూ.220, రిటర్న్ జర్నీకి రూ.315 నుంచి రూ.325 లకు గంజాల్ లో పెంచారు. భారీ వాహనాలకు గంజాల్ లో సింగిల్ ట్రిప్ రూ.400 నుంచి రూ.415 కు, రిటర్న్ జర్నీ కి రూ.605 నుంచి రూ.625 కు పెంచారు. అలాగే దిలావర్ పూర్ ప్లాజాలో రూ.325 నుంచి రూ.335 కు, రిటర్న్ రూ.490 నుంచి రూ.505 కు పెంచారు.





# రేషన్ షాప్ ల్లో మోదీ ఫొటో పెట్టాలి

## బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** రేషన్ షాప్ ల్లో ప్రధాని మోదీ ఫొటో పెట్టాలని బీజేపీ భీమదేవరపల్లి మండల అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఒక వింత రాజకీయం చేస్తున్నదన్నారు. ఐదు సంవత్సరాలుగా రేషన్ షాప్ ల ద్వారా ఉచితంగా బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదని గుర్తుచేశారు. రాష్ట్రంలో రేషన్ షాప్ ల ద్వారా లబ్ధిదారులకు అందించే బియ్యానికి ఒక్క కిలోకి రూ.40లను కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నదని వివరించారు. నిరుపేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా ఎంతో చెప్పాలని ప్రశ్నించారు. రేషన్ షాప్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటో పెట్టకుండా కేవలం సీఎం, స్థానిక ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ ఫొటో పెట్టడం బాధాకరమన్నారు. రాబోయే రోజుల్లో అన్ని రేషన్ షాప్ లో నరేంద్ర మోదీ ఫోటో పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే బీజేపీ భీమదేవరపల్లి మండల శాఖ ద్వారా అన్ని రేషన్ షాపుల ఎదుట ప్రధాని ఫొటో ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపల్లి పృధ్విరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు దొంగల కొమరయ్య, ప్రధాన కార్యదర్శి గుండెల్ని సదానందం, మండల ఉపాధ్యక్షులు దొంగల వేణు, ఓబీసీ మోర్చా అధ్యక్షులు దొంగల రాణాప్రతాప్, శక్తి కేంద్రం ఇన్చార్జులు బైరి సదానందం, శనిగరపు ఐలయ్య, కాలేరు వికాస్, బొల్లంపల్లి శ్యామ్, బొజ్జపురి పృథ్వీరాజ్, కత్తుల విజయ్, పట్ల అఖిల్ పాల్గొన్నారు.



# రైతుకు అండగా శ్రీకృష్ణ గోశాల ట్రస్ట్ సభ్యులు

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలంలోని గాలిపెల్లి గ్రామానికి చెందిన రైతు కేశవేని ఎల్లయ్య తన వ్యవసాయ భూమిలో మంగళవారం నాగలి దున్నుతుండగా.. అకస్మాత్తుగా తన ఎద్దు మృతి చెందింది. ఉన్న కొద్దిపాటి భూమిని ఎడ్లను నమ్ముకుని జీవిస్తున్న తనకు ఇదేమి కర్మ దేవుడా అని ఆ కుటుంబం రోదిస్తున్న బాధను చూసి ఇల్లంతకుంట శ్రీకృష్ణ గోశాల ట్రస్ట్ సభ్యులు వెంటనే స్పందించి గోశాలలోని ఒక మంచి కోడెద్దును ఆ రైతుకు ఇచ్చి అండగా నిలిచారు. దీంతో ఆ రైతు సంతోషంతో మురిసిపోయాడు. ట్రస్ సభ్యులు ఇచ్చిన ఎద్దుతో మళ్లీ వ్యవసాయం చేసుకుంటానన్నారు. ఎల్లప్పుడూ గోశాలకు, ట్రస్ట్ సభ్యులకు రుణపడి ఉంటానని కృతజ్ఞతుల తెలిపారు. కార్యక్రమములో గోశాల ట్రస్టు అధ్యక్షుడు అయ్యన్న హరికృష్ణరెడ్డి, ఉపాధ్యక్షులు కేసరి కనుకయ్య, కునబోయిన బాలరాజు, రమేష్ సింగ్, నార్ల రామకిషన్, రాము సేటు, నారెడ్డి కిషోర్, మహేందర రెడ్డి, దినేష్ బండారి నర్సయ్య, లక్ష్మన్ తదితరులకు పాల్గొన్నారు.

4 కలంజ్యోతి
బుధవారం 02.04.2025 General News

# నగరాలకు ధీటుగా పట్టణాన్ని అభివృద్ధి చేస్తాం

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**కలంజ్యోతి, జగిత్యాల :** నగరాలకు ధీటుగా పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో మోతే రోడ్డు ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగిత్యాల అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రం నలువైపుల శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హయంలో గతంలో ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్ట్ లో భాగంగా జగిత్యాలలో 300 ఎకరాలలో కాడ ఏర్పాటు చేసి 197374లో చల్ గల్ వాలంతరీ కేంద్రం, 1980 లో పొలాస వ్యవసాయ పరిశోధన కేంద్రం స్థాపనకు బీజం ఏర్పడిందన్నారు. జగిత్యాల పట్టణంలో 14 జోన్లలో 121 సర్వే నంబర్లను మార్పు చేసి, కాంక్రీట్ జంగల్ గా మారిన జగిత్యాలను పరిస ర గ్రామాలను సైతం కలిపి అభివృధి విస్తరణకు కృషి చేశామని తెలిపారు. జగిత్యాల నియోజ కవర్గ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ఉపయో గించుకోవడం అభివృద్ధి చేయడం తన బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్రంలో అతి పెద్ద ప్రాజెక్ట్ 4.520 డబల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ కాలని కాబోతుందని పేర్కొన్నారు. మల్యాల మండలం నూకపల్లి, నర్సింగాపూర్ 188 ఎకరా లను జగిత్యాల మున్సిపల్ లో కలపడం కోసం క్యాబినెట్, అసెంబ్లీలో తీర్మానం చేయడం జరిగిందన్నారు. గవర్నర్ ఆమోదం మాత్రమే మిగిలి ఉందన్నారు. కేంద్ర పట్టణ, గృహ నిర్మాణ అభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ ను గతంలో కలిసి పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందజేసి అభివృద్ధికి కృషి చేయాలని కోరామని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఎస్కే కన్సల్టెన్సీ ఆద్వర్యం లో సర్వే పూర్తి అయిందని, రూ.350 కోట్ల పైగా నిధులతో అధికారులు డీపీఆర్ సిద్ధం చేశామని చెప్పారు. ప్రణాళిక ప్రకారం జగిత్యాల పట్టణం అభివృద్ధి రైతులకు నష్టం కాకుండా మాస్టర్ ప్లాన్ అమలు చేయడం కోసం ప్రయత్నంతో పాటు మాస్టర్ ప్లాన్ ద్వారా రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని తెలిపారు. అమృత్ స్కీమ్ లో 3 ఏండ్లలో ప్రతి ఇంటికి తాగునీరు యూఐడీఎఫ్ ప్రకారం లక్ష జనాభా ఉన్న పట్టణా నికి కేంద్ర రాష్ట్ర భాగస్వామ్యంతో అమృత్ స్కీమ్ అమలు చేస్తూ నిధులు కూడా మంజూరు అయ్యాయన్నారు. కార్యక్రమంలో మాజీ ము న్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్, గోలి శ్రీనివాస్, క్యాదసు నాగయ్య, పద్మావతి పవన్, మల్లవ్వ తిరుమలయ్య, కుసరి అనిల్, కొలగని సత్యం, శ్రీనివాస్, దుమాల రాజ్ కుమార్, శరత్ రావు, కోటేశ్వర రావు, శ్రీరామ్ భిక్షపతి, వెంక టేష్, శ్రీకాంత్, గట్టురాజు, మార రవిశంకర్, రహీం, నాయకులు ఉన్నారు.



## అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తా..

**కలంజ్యోతి, జగిత్యాల:** అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో 4వ వార్డులో రూ.57.50 లక్షలతో జగిత్యాల పట్టణంలో అన్ని వార్డులలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కరెంటు స్తంభాల ఏర్పాటుకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు చట్ట ప్రకారం నూతన ఇంటి నిర్మాణాలు చేపట్టాలలని, లేఅవుట్ ప్రకారం నిర్మాణాలు చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ అభివృద్ధికి ప్రజలు కూడా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ స్పందన, మాజీ మున్సిపల్ చైర్మన్లు అడువాల జ్యోతి లక్ష్మణ్, గోలి శ్రీనివాస్,క్యాదసు నాగయ్యా, క్యాదసు నవీన్,ఈశ్వర్, ఏడీఈ జవహర్ నాయక్, కలేం, ఏఈలు సతీష్, సంతోష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



## సన్నబియ్యం పంపిణీ ప్రారంభం

### ముఖ్య అథితిగా హాజరైన నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని అమీనాబాద్, ఉప్పరపల్లి, పాపాయిపేట గ్రామాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధబోయిన రమేష్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి ఆదేశాల మేరకు గాజులరామారం డివిజన్ కైసర్ నగర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, ఎండీ లయాక్, చాంద్ పాషా, గాజుల రామారం డివిజన్ మైనార్టీ ప్రెసిడెంట్ సమీర్ ఖాన్, స్టేట్ జాయింట్ కన్వీనర్ ఎండి గఫార్, అజయ్, ఆసిఫ్, ఆజాం, తదితరులు పాల్గొన్నారు.

# సన్నబియ్యం పంపిణీ పేద ప్రజలకు గొప్పవరం

## కొలను హనుమంత్ రెడ్డి

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న చౌకదారుల దుకాణంలో పేద ప్రజలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రమంతా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని సాయి నగర్ చౌకదారుల దుకాణలలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి మంగళవారం లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మహిళ కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రటరీ షేక్ రఫీయా బేగమ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ జీవన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ (లడ్డు), మల్లికార్జున్, మెడ శ్రీను, శ్రీనివాస్, రహీమ్, సంజీవ, మిట్టు పాల్గొన్నారు.







## మహిళలపై వరుస అఘాయిత్యాలు శోచనీయం

**బీఎస్పీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న**

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** నాగర్ కర్నూల్ జిల్లా, జడ్చర్ల అసెంబ్లీ, ఊరుకొండపేట పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర మహిళపై ఒక గ్రూప్ నిందితులు లైండికదాడికి ఒడిగట్టిన ఘటన యావత్తు దేశాన్ని కలచివేస్తుందని, ఈ ఘటన జరగడం దురదృష్టకరం బీఎస్పీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న, జిల్లా ఇంచార్జీ పృధ్వీరాజ్, కల్వకుర్తి అసెంబ్లీ అధ్యక్షుడు బాలు విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సొంత జిల్లాల్లో మహిళలపై వరుస ఘటనలు జరగడాన్ని బీఎస్పీ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. మొలచింతలపల్లిలో ఆదివాసీ మహిళాపై, ఇప్పుడు ఆలయం దగ్గర ఇంకో మహిళపై లైంగికదాడి జరగడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు ఇంటలిజెన్స్, పోలీసుల వైఫల్యమనే కోణంలో విచారణ జరగాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నర అవుతున్న రాష్ట్రంలో హోమ్ మంత్రి లేడని ఎద్దేవా చేశారు. జిల్లాల్లో జరుగుతున్న చాలా ఘటనల్లో నిఘా విభాగం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందని విమర్శించారు. తక్షణమే సీఎం స్పందించి జిల్లాల్లో పోలీస్, నిఘా విభాగాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. అట్లాగే ఐజీ సత్యనారాయణరాజుతో బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ నిందితుల వెనక ఎవరున్నా, ఎంత పెద్దవాళ్లున్న కఠిన శిక్షలు అమలు చేయాలని కోరారు. ఐజీ కూడా సానుకూలంగా స్పందించారన్నారు. బాధిత మహిళా కుటుంబానికి రూ.50 లక్షలు ఇచ్చి ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీహర్ష ముదిరాజ్, కల్వకుర్తి అసెంబ్లీ ఇంచార్జీ మీసాల రమేష్, నాగర్ కర్నూల్ అసెంబ్లీ అధ్యక్షులు కల్యాణ్, కోశాధికారి భాస్కర్, సోషల్ మీడియా ఇంచార్జీ నర్సింహా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# లైంగికదాడి నిదితులపై కఠిన చర్యలు

- ఐజీ సత్యనారాయణ, ఎస్పీ వైభవ్ గైక్వాడ్
- ఊరుకొండపేట ఘటనపై ఐజీ విచారణ
- అవసరమైతే ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపిస్తాం



**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** ఊరుకొండ మండలం ఊరుకొండపేటలో జరిగిన లైంగికదాడి ఘటన స్థలాన్ని ఐజీ సత్యనారాయణ, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ పరిశీలించారు. ఊరుకొండపేట దేవాలయం సమీపంలో శనివారం రాత్రి జరిగిన లైంగికదాడి ఘటనలో ఏడుగురు పాల్గొన్నట్టు ఐజీ సత్యనారాయణ తెలిపారు. లైంగికదాడి ఘటనకు సంబంధించిన ముఖ్యమైన నిందితుడిగా ఉన్న దేవాలయంలో తాత్కాలికంగా పనిచేసే సిబ్బంది తన స్నేహితులను పిలిపించుకొని ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ఐజీ తెలిపారు. ఈ ఘటనలో ఏడుగురు పాల్గొన్నట్టు పేర్కొన్నారు. విచారణలో గతంలో వీరు కొంతమంది మైనర్లను బెదిరించి డబ్బులు వారి నుంచి డబ్బులు తీసుకున్నారన్నారు. మైనర్లను ఏమైనా చేస్తే ఫోక్సో కింద కేసు నమోదు అవుతుందని తెలివితో మైనర్ల దగ్గర డబ్బులను తీసుకొని పంపేవారని విచారణలో తేలిందన్నారు. వీరిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపిస్తామని వెల్లడించారు.

# గ్యాంగ్ రేప్ నిందితులను కఠినంగా శిక్షించాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు**

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** ఊరుకొండ మండలం ఊరుకొండపేట దేవాలయం దగ్గర శనివారం ఒక మహిళపై లైంగికదాడి చేసి, చిత్రహింసలకు చేయడం ప్రజాస్వామ్యంలో దుర్మార్గమైన చర్య అని ఇటువంటి ఘటనలు ప్రజలందరూ ఖండించాలని సీపీఎం జిల్లా కార్య దర్శి వర్ధం పర్వతాలు విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర నిందితుల ను కఠినంగా శిక్షించాలని, బాధిత మహిళను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యాంగ్ రేప్ కి పాల్పడిన నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుచేసి విచారణ పూర్తిచేసి కఠినమైన శిక్షలు పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకో వాలన్నారు. మహిళకు వైద్య చికిత్సలు అందించి పునరావాసం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు ఆర్ శ్రీనివాస్, కందికొండ గీత, జిల్లా నాయకులు పొదిలి రామయ్య, అంతటి కాశన్న, మల్లయ్య, వెంకటేష్, కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.








## పేదవర్గాల ఆశాజ్యోతి సీఎం రేవంత్ రెడ్డి


**ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

**కలంజ్యోతి, జగిత్యాల :** పేద, బలహీన వర్గాల ఆశాజ్యోతి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కీర్తించారు. జగిత్యాల పట్టణంలోని 8వ వార్డు బుడగ జంగాల కాలనీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత రేషన్ కార్డుదారులకు ఉచిత సన్నబియ్యం పంపిణీ పథకాన్ని జగిత్యాలఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదప్రజలకు పలు సంక్షేమ పథకాలు అందించి వారి గుండెల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిర స్థాయిలో నిలిచిపోయారని నిరుపేదలకు ఉచితంగా సన్నబియ్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. సన్నబియ్యం పంపిణీ నిరుపేదల పాలిట వరంగా భావిస్తూ సన్న బియ్యం పంపిణీ ద్వారా నిరుపేదలకు నిజమైన ఆహార భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, సివిల్ సప్లై డీఎం జితేంద్రప్రసాద్, కమిషనర్ స్పందన, మాజీ మున్సిపల్ చైర్మన్ లు ఆడువల జ్యోతిలక్ష్మణ్, గౌలి శ్రీనివాస్, తాజా మాజీ కౌన్సిలర్ మల్లవ్వ తిరుమలయ్య, నాయకులు ఎల్జీ రమేష్, గోపి, ఆవారీ గంగాధర్, వడ్నాల శ్రీనివాస్ భాస్కరరావు, అధికారులు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంజన్న సన్నిధిలో దీక్ష స్వాముల సందడి



కలంజ్యోతి, మల్యాల : ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీఆంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం దీక్ష స్వాములతో భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుండి వేలాది సంఖ్యలో స్వాములు తరలివచ్చారు. సర్వదర్శనం క్యూ లైన్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు స్వామి వారిని అలంకరించి , ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ముందుగా కోనేరులో స్నానాలు ఆచరించిన అనంతరం స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీతో లడ్డు ప్రసాదాల కౌంటర్లను అదనంగా ఏర్పాటు చేశారు. స్వామి దర్శనానంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.







# శోభితాకు బంపర్ ఆఫర్

నటి శోభితా ధూళిపాళ్ల బంపరాఫర్ కొట్టినట్లు తెలుస్తుంది. పెళ్లికి ముందు బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ నాగచైతన్యతో పెళ్లి అనంతరం కొద్దిరోజులు సినిమాలకు దూరంగా ఉంటుంది. అయితే ఇప్పుడు మళ్లీ సినీ రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది ఈ భామ. తమిళ ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ ఒక సినిమాను తెరకెక్కించబోతుండగా.. ఈ సినిమాలో హీరోయిన్‌గా శోభితా ధూళిపాళ్లకు అవకాశం దక్కినట్లు తెలుస్తుంది. తమిళ అగ్ర దర్శకుడిలలో రంజిత్ ఒక్కడు. అట్టకత్తి మద్రాస్, కబాలి, కాలా, సర్పాట్ట పరంబరై, తంగలాన్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ని సంపాదించుకున్నాడు రంజిత్. అయితే తంగలాన్ తర్వాత రంజిత్ వెట్టువం అనే ఒక ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో దినేశ్ హీరోగా నటించబోతుండగా.. ఆర్య విలన్ పాత్రలో నటించనున్నాడు. అట్టకత్తి చిత్రం తరువాత వీరి కాంబోలో వస్తున్న రెండో సినిమా ఇది. అయితే ఈ సినిమాలోనే శోభితా ధూళిపాళ్లను హీరోయిన్‌గా తీసుకుంటున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే శోభితకు ఇది మంచి అవకాశం అని చెప్పవచ్చు.